


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఏలూరు జిల్లా పశ్చిమ గోదావరి జిల్లా

శనివారం, 14 జూన్ 2025

8 పేజీలు


# విశిష్ట ఆభరణాల వేదిక వేగ జ్యుయలరీ శుభారంభం






**– ఏలూరులో సందడి చేసిన నందమూరి బాలకృష్ణ, సంయుక్త మీనన్**

**ఏలూరు,మేజర్‌న్యూస్ :** విశ్వసనీయతకు మరోపేరుగా నిలిచిన వేగ జ్యుయలర్స్ ఏలూరు పట్టణంలో తమ 5వ నూతన షోరూంను శుక్రవారం ప్రారంభించారు. విశిష్ట అభరణాల వేదిక వేగ జ్యుయలర్స్ ప్రచారకర్తగా వ్యవహరిస్తున్న ప్రముఖ సినీ నటుడు,శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ నూతన షోరూంను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీనటి సంయుక్త మీనన్ పాల్గొని సందడి చేసారు. నూతన వేగ జ్యుయలరీ షోరూంలో అందంగా అమర్చిన వేలాది రకాల ఆభరణాలను కలయతిరిగి వారిద్దరు తిలకించారు. కొన్ని నగల విశిష్టతలను అడిగి తెలుసుకున్నారు. నూతన షోరూం ప్రారంభం సందర్భంగా వేగ జ్యుయలర్స్ చైర్మన్ బండ్లమూడి రామోహన్,మేనేజింగ్ డైరెక్టర్– వనమా నవీన్ కుమార్,డైరెక్టర్లు వనమా సుధాకర్,చంద్రకాంత్ ,చిట్లూరు నాగేశ్వరావు మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాలలో ప్రజలకు అద్భుతమైన, వారు ఆశించిన డిజైన్ ఆభరణాలు అందించాలనే లక్ష్యంతోనే తమ షోరూం ఇంతకు ముందు కాకినాడలో ప్రారంభించామని,ఇప్పుడు ఏలూరులో ప్రారంభించటం ఎంతో సంతోషంగా ఉంది అన్నారు. ముఖ్యంగా బాలయ్య బాబు ఎంతో బిజీగా ఉన్నా షోరూంను ప్రారంభించుటకు రావటం అమితానందం కలిగించినది అన్నారు. 'వెలలేని వైభోగం

- తరువాయి 2లో..

## జిల్లా కలెక్టర్ నాగరాణి తీవ్ర ఆగ్రహం

- డబ్బులు వసూలు చేసిన ఆసుపత్రుల యాజమాన్యాలపై చర్యలు
- డెంగ్యూపేరిట వసూలు చేసిన మొత్తానికి మూడు రెట్లు అపరాధ రుసుం



**భీమవరం,మేజర్‌న్యూస్ :** ఎన్టీఆర్ వైద్య సేవ ఉచిత చికిత్సలకు ఏ హాస్పిటల్ అయినా డబ్బులు వసూలు చేస్తే పెద్ద మొత్తంలో అపరాధ రుసుముతో పాటు, తీవ్రమైన కఠిన చర్యలు ఉంటాయని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి గట్టిగా హెచ్చరించారు.

- తరువాయి 2లో..

## విద్యార్థుల యోగాసనాలతో పులకరించిన హేలాపురి







- అలరించిన యోగా ముద్ర ఆకృతితో ప్రదర్శన
- పాల్గొన్న కలెక్టర్ వెట్రిసెల్వి,ఎమ్మెల్యేలు బడేటి, చింతమనేని,జెసి ధాత్రిరెడ్డి,అప్పల నాయుడు

**ఏలూరు,మేజర్‌న్యూస్:** ఏలూరు సర్.సి.ఆర్.రెడ్డి కళాశాలలో శుక్రవారం నిర్వహించిన విద్యార్థుల థీమ్ యోగాతో హేలాపురి నగరం పులకరించింది. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులతో ప్రదర్శించిన యోగముద్ర ఆకృతి అందరిని ఆకట్టుకుంది. విద్యార్థినీ, విద్యార్థుల థీమ్ యోగాకు మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్నజిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, ఎమ్మెల్యేలు బడేటి రాధాకృష్ణ(చంటి), చింతమనేనిప్రభాకర్,జాయింట్‌జెసి పి.ధాత్రిరెడ్డి, విజయవాడ ఆర్.టి.సి. రీజనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఏలూరు, దెందులూరు మార్కెట్ యార్డ్ చైర్మన్లు మామిళ్లపల్లి పార్థసారథి, గారపాటి రామసీత, కార్పోరేషన్ కో–ఆప్షన్

- తరువాయి 2లో..

## బిస్కెట్లు,టీ కోసం రావాలా ?

- సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించిన ఎంపీపీ, జెడ్పిటిసి, ఎంపిటిసిలు
- త్వరలో మూకుమ్మడి రాజీనామాలు : ప్రోటోకాల్‌పై రగడ



## టి.నర్సాపురం గ్రామానికి ఇద్దరు టిడిపి అధ్యక్షులా...?

**– జిల్లా,రాష్ట్ర నాయకత్వం సమస్య పరిష్కరించాలి !**

**టి.నర్సాపురం,మేజర్‌న్యూస్:** టి.నర్సాపురం మండలంలో గత 12 సంవత్సరాల నుంచి తెలుగుదేశం పార్టీలో వర్గ పోరు కొనసాగుతూనే ఉందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతి,జయంతి వేడుకలు,పార్టీ ఇతర కార్యక్రమాలు కూడా విడివిడిగా చేయడం ఇక్కడ ఆనవాయితీ అయింది. ఇక్కడ మండల కేంద్రం పేరుకు మాత్రమే కానీ ఇన్ని సంవత్సరాల తర్వాత కూడా ఎన్టీఆర్ విగ్రహం కూడా లేక లేకపోవడం గమనార్హం. కానీ పార్టీ పదవులకు




కొల్లి రమేష్    పేరం రాంబాబు

మాత్రం పోటీలో 'తగ్గేదే లేదంటూ' కొందరు నాయకులువ్యవహరిస్తున్నారు.

- తరువాయి 2లో..

## ఎమ్మెల్యే డా.కామినేనికి 'యువగళం' అందించిన మంత్రి లోకేష్



**కైకలూరు,మేజర్‌న్యూస్:** ఈరోజు ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ అస్యూరెన్స్ కమిటీ చైర్మన్, కైకలూరు నియోజకవర్గ శాసనసభ్యులు డా. కామినేని శ్రీనివాస్ విజయవాడలో రాష్ట్ర ఐటీ మరియు విద్యా శాఖమాత్యులు శ్రీనారా లోకేష్‌ని మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ డా.కామినేనికి యువగళం పుస్తకం అందజేశారు. ఈసందర్భంగా కామినేని నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలు,రాజకీయ పరిణామాలపై చర్చించారు. నేటి బాలలే రేపటి పౌరులు అనే మాటకు మూలస్థంభాలుగా వున్న బాలలకు చక్కటి నాణ్యతమైన విద్యను అందించటానికి నిర్మాణాత్మకమైన చర్యలు

- తరువాయి 2లో..

# జిల్లా కలెక్టర్ నాగరాణి తీవ్ర ఆగ్రహం

మొదటిపేజీ తరువాయి

శుక్రవారం భీమవరం కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరము నందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షతన నిర్వహించిన డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ సేవలకు డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై 17 హాస్పిటల్స్ కు సంబంధించి వచ్చిన ఫిర్యాదులను విచారించారు.ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పేదల కోసం చేస్తున్న వైద్య సహాయాన్ని తూట్లు పొడిచే విధంగా కొన్ని హాస్పిటల్స్ డబ్బులు వసూలు చేయడంపై సంబంధిత హాస్పిటల్స్ యాజమాన్యాలపై కలెక్టర్ తీవ్ర అగ్రహాన్ని వ్యక్తం చేస్తూ ఇటువంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని తీవ్ర హెచ్చరికలను చేశారు.లేని జబ్బులను ఉన్నట్టుగా చూపించి వైద్యం చేయడమేనా మీపని?అని తీవ్ర స్వరంతో గర్జించారు. పేదల ప్రాణాలతో చెలగాటమాడుతారా ?అని ప్రశ్నించారు. ఏ చిన్న పొరపాటు జరిగిన ఎంతటి హాస్పటల్ నైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. పుట్టిన పిల్లలకు కామెర్లు లేకుండానే,కామెర్ల పేరిట ఫోటో థెరపీ పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారని, ప్రైవేట్ హాస్పిటల్స్లో పుట్టిన ప్రతిబిడ్డ రక్త నమూనాలను సేకరించి పరీక్షించడం జరుగుతుందని,ఫోటో థెరపీ అవసరం లేకుండానే చికిత్స చేసినట్లు తెలిస్తే తీవ్రమైన చర్యలు ఉంటాయన్నారు. ప్రజలు కూడా అవగాహన కలిగి ఉండాలని, ఆలోచన ధోరణిలో మార్పు రావాలని ప్రభుత్వ ఆసుపత్రిలలో మెరుగైన వసతులతో కూడిన ప్రసూతి సేవలను ఉచితంగా అందిస్తున్నారని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఒక ఆసుపత్రి డెంగ్యూ లేకుండానే డెంగ్యూ పేరిట వైద్యంచేసి డబ్బులు వసూలు చేసేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో డిఎం అండ్ హెచ్ఓ ఆదేశాల మేరకు సంబంధిత రోగుల నుండి శాంపిల్స్ కలెక్షన్ చేయడం, డెంగ్యూ అనేది వాస్తవం కాదని స్పష్టం కావడంతో ఎందుకు ఇలా చేయాల్సి వచ్చిందనీ సంబంధిత హాస్పిటల్ డాక్టర్ ని గట్టిగా నిలదీశారు. ఒకవేళ డెంగ్యూ పాజిటివ్ వస్తే మీరు ప్రభుత్వ ఆసుపత్రికి తెలియజేయాలి కదా, ఇది ఎంత ప్రమాదకరమైన విషయమో మీకు తెలియదా ? తెలియజేయకపోవడం తోనే మీ ఉద్దేశ్యం ఏమిటో స్పష్టంగా అర్థమవుతుందని తీవ్ర ఆగ్రహంతో ఊగిపోయారు.డెంగ్యూ అనేది ఎంత ప్రమాదకరమో మీకు డాక్టర్ గా తెలియదా? దీని ప్రభావం ప్రజల మీద ఉంటుందా లేదా ఇటువంటి ప్రశ్నలతో తీవ్రంగా మందలించారు. డెంగ్యూ పేరిట వసూలు చేసిన మొత్తానికి మూడు రెట్లు కలిపి అపరాధ రుసుముగా వసూలు చేయాలని ఆదేశించారు. అదే ఆసుపత్రి ఇంకొక కేసు కేసు విషయంలో రూ.80 వేలు వసూలు చేసినందుకు దానికి రెట్టింపు కలిపి అపరాధ రుసుముగా వసూలు చేయాలని ఆదేశించారు. స్మైల్ డెంటల్ హాస్పిటల్ అండ్ ఫేషియల్ సర్జరీ సెంటర్ ఎన్టీఆర్ వైద్య సేవ కింద చికిత్స చేయకుండానే చికిత్స చేసినట్లు బిల్లు క్లైమ్ చేశారు అనే అభియోగంలో వాస్తవం లేదని ధ్రువీకరించారు. తప్పుడు పిర్యాదులు చేసిన కూడా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పిర్యాదుదారుని ఆరోపణలో వాస్తఅవాస్తవాలను పూర్తిగా తెలుసుకుని, ఆధారాలతో వార్తలు వ్రాయాలని సున్నితంగా తెలియజేశారు. ఏ విధమైన ఆరోపణలు మీ దృష్టికి వచ్చిన ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు జిల్లా కోఆర్డినేటర్తో ధృవీకరించుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ సమావేశంలో డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ జి గీతా బాయి, డి సి హెచ్ ఎస్ డాక్టర్ పి సూర్యనారాయణ, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కీర్తి శ్రవణ్, వర్మ హాస్పిటల్, తణుకు యాపిల్ హాస్పిటల్, రాజర్షి హాస్పిటల్, ఆర్కే గాయత్రి హాస్పిటల్, సూరి తేజ ఆర్థోపెడిక్ అండ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, యూనియన్ హాస్పిటల్స్ ఆఫ్ రామలక్ష్మి హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్, శ్రీ సూర్య నర్సింగ్ హోమ్, స్టార్ హాస్పిటల్ ఎమర్జెన్సీ అండ్ క్రిటికల్ కేర్, తేజ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ కు సంబంధించిన డాక్టర్లు, వారి ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## బిస్కెట్లు,టీ కోసం రావాలా ?

**ముదినేపల్లి,మేజర్న్యూస్:** మండలంలోని అధికార కార్యక్రమాలకు తమను పిలవడంలేదని, ఏసమాచారాన్ని అధికారులు తమకు తెలపడం లేదని, అధికారులు తమను పట్టించుకోవడం లేదని ఎంపీపీ, వైసిపి నాయకులు రామిశెట్టి సత్య నారాయణ అన్నారు. శుక్రవారం ముదినేపల్లి మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సమావేశం దేనికని బిస్కెట్లు ,టీ కోసం రావాలా అంటూ ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రజలతో ప్రత్యక్షగా ఎన్నిక కాబడిన ప్రతినిధులం అత్యంత భారీ మెజార్టీతో గెలిచి రాజ్యాంగ కల్పించిన హక్కుతో మండల పరిషత్ కమిటీగా ఏర్పడిన తమకు ప్రోటోకాల్ ఇవ్వకపోవడం సభ్యులను అవమాన పరచడమే అన్నారు. సంఘ సభ్యులకు గౌరవం ఇవ్వలేనప్పుడు దేనికి ఈ సమావేశం అన్నారు.విద్యాశాఖ ,పోలీస్ శాఖ,ఎక్సైజ్ శాఖ ఇతర శాఖల అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి హాజరు కాని అధికారులపై చర్యలు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఈడే వెంకటేశ్వరమ్మ ,ఎంపీడీవో వై రామకృష్ణ ,తాహసిల్దార్ ఎస్.కె లతీఫ్ భాషా,ఎంపీటీసీలు , సర్పంచులు,అధికారులు పాల్గొన్నారు.

## వరిలో ఆరుతడి పద్ధతి సాగుతో అధిక దిగుబడి

**– జిల్లా వ్యవసాయ శాఖ అధికారి షేక్ హబీబ్ బాషా**



**ఏలూరు,మేజర్న్యూస్ :** వరిలో ఆరుతడిపద్ధతిసాగుతో అధిక దిగుబడిని సాధించ వచ్చుని డీఏవో షేక్ హబీబ్ బాషా ,జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ బి.వెంకటేష్ తెలిపారు. ఏలూరులోని జిల్లా కళ్యాణి అపార్ట్మెంట్ లో కమ్యూనిటీ రిసోర్స్ వ్యక్తులుకి అంతః జాతియ వరి పరిశోధన కోర్ ప్రాజెక్ట్ గురించి డీఏవో షేక్ హబీబ్ బాషా వివరంచారు. వరిలో ఆరుతడి పద్ధతి, హరిత గృహవాయువు వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు.అలాగే కోర్ ప్రాజెక్టు సిబ్బంది ఈ శిక్షణలో వరిలో ఆరుతడి పద్ధతి ఏవిధంగా పాటించాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలియచేశారు. ఆరుతడి పద్ధతి సాగు వల్ల 30శాతం వరకు సాగు నీరు ఆదా అవుతుం దన్నారు. అలాగే మెరుగైన పంట ఎదుగుదల ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఎంయు స్టాఫ్,శాస్త్రీయ శాస్త్రవేత్తలు అంకిత పాల్, పవన్ యెగ్గిన్, ప్రతినిధులు పాల్గొన్నారు.

# టి.నర్సాపురం గ్రామానికి ఇద్దరు టిడిపి అధ్యక్షులా...?

మొదటిపేజీ తరువాయి

ఈ మధ్యకాలంలో ఒక వర్గం వారు టి.నర్సాపురం గ్రామ టిడిపి అధ్యక్షులుగా పేరం రాంబాబుని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తదుపరి కొన్ని రోజులు గడవకుండానే గ్రామ పార్టీ మాజీ అధ్యక్షులు కొల్లి రమేష్ను మళ్ళీ కొనసాగించాలని మరి కొందరు ఆయన పేరు తెరమీదకి తీసుకొచ్చారు. దీనిని బట్టి పార్టీ పరిస్థితి ఏమిటో అర్థమవుతుందని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు.

**– క్రమ శిక్షణ కలిగిన పార్టీలో వర్గ విభేదాలా ? –**తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణ గల పార్టీయా? కాదా? అనే మాటలు కూడా వినిపిస్తున్నాయి. ఇక్కడ మాత్రం ఒకటి, రెండు వర్గాలు కాదు ఈ మండలంలో నాలుగు,ఐదు వర్గాలు ఉన్నట్టు బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. సమస్య ఏదైనా వస్తే ఏ అధ్యక్షులుకి చెప్పుకోవాలి ? అనే సందిగ్ధంలో కార్యకర్తలు ఉన్నారు. పార్టీని బలోపేతం చేసి ఎప్పటి నుంచో కంచుకోటగా ఉన్న తెలుగుదేశం పార్టీ త్వరలోనే విభేదాల పర్వంతో విడిపోతుందనే ఆందోళన కొందరిలో కనిపిస్తోంది. కూటమి ప్రభుత్వం, ప్రత్యేకించి టిడిపి అధికారంలో ఉన్నప్పటికీ ఈ వర్గపోరు వల్ల ఏ ఒక్క చిన్న పని కూడా చేయించుకోలేక పోతున్నామని సీనియర్ నాయకులు చెప్పుకొస్తున్నారు. ఈ విధంగా వర్గ పోరు కొనసాగుతుండడంతో పార్టీలో ఏమి జరుగుతుందో అనే ఆలోచనలో తెలుగుదేశం పార్టీ అభిమానులు, కార్యకర్తలు అయోమయంలో ఉన్నారు.

**– అభివృద్ధికి ఆమడ దూరంలో టి.నర్సాపురం మండలం –**ఈ వర్గ పోరుకు స్వస్తి చెప్పి అభివృద్ధి పనులు చేపిస్తే చాలా బాగుంటుందని పార్టీ అభిమానులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల వల్ల గ్రామమే కాదు మండలం మొత్తం కూడా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండటానికి కారణం వర్గ పోరే అని చెబుతున్నారు. ఇవే కాదు ఏ అభివృద్ధి పనులలో అయినా అందరూ కలిసి పని చేస్తే మండలాభివృద్ధి కనపడుతుందని అంటున్నారు. ఏది ఏదైనా ఈ మండలంలో ఏ పదవి కావాలన్నా,ఏ పనులు కావాలన్నా,ఈ వర్గ పోరు వల్ల, ఎవరికి వారే యమునా తీరే చందంగా పరిస్థితులు తయారు కావడం వల్ల ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పార్టీ పరిస్థితి తయారయింది. ఇప్పటికైనా జిల్లా, రాష్ట్ర అధి నాయకత్వం టి.నర్సాపురం మండలం పైన,గ్రామంలోని పరిస్థితులపైన దృష్టి పెట్టి తెలుగుదేశం పార్టీకి కాయకల్ప చికిత్స చేయాలని పలువురు పార్టీ అభిమానులు కోరుకుంటున్నారు.

## విశిష్ట ఆభరణాల వేదిక వేగ జ్యుయలరీ శుభారంభం

మొదటిపేజీ తరువాయి

– తరుగులేని నమ్మకం మా అభిమతం' అన్నారు. ఖాతాదారుల నమ్మకానికి కట్టుబడి నిబద్ధతతో మా షోరూంలు సుస్థిరమైన వ్యాపారం సాగిస్తున్నాయని ఈ సందర్భంగా వారు తెలిపారు. నూతన షోరూం ప్రారంభం పురస్కరించుకుని అనేక ప్రత్యేక ఆఫర్లను ప్రవేశపెట్టామని, ప్రతి లక్ష రూపాయల కొనుగోలు పైన ఉచిత బంగారు నాణెం అందించటమే కాక, పాత బంగారం మార్పిడి పైన ప్రతి గ్రాముకు వంద రూపాయలు అదనంగా చెల్లించు ఏర్పాటు చేసామని చెప్పారు. డైమండ్ (వజ్రాలు) ధర క్యారట్ ఒక్కింటికి రూ.51,999 మాత్రమేనని ఈ సందర్భంగా వనమా బ్రదర్స్ తెలిపారు. అంతేకాక ఏలూరు షోరూం ప్రారంభం సందర్భంగా ఒక లక్కీ డ్రాను నిర్వహించి అయిదుగురు లక్కీ డ్రా విజేతలకు ఒక్కొక్కరికి రెండు లక్షల రూపాయల విలువైన డైమండ్ నెక్లెస్ లను బహుమతిగా అందిస్తాము అన్నారు. ఈ ఆఫర్లు అన్ని తమ ఏలూరు షోరూం నకు మాత్రమే వర్తిస్తాయని, ఈ ఆఫర్లు 30 జూన్ 2025 వరకు మాత్రమే అందుబాటులో ఉంటాయి అని వివరించారు.వేగ జ్యుయలర్స్ షోరూం నందు ప్రాచీనత నుండి ఆధునికత వరకు, సంప్రదాయ నగల నుండి ఫ్యాషన్ నగలు వరకు అన్ని రకాల ఆభరణాలు ఖతాదారుల అభిరుచి ప్రకారం అందుబాటులో ఉంటాయి. రాబోయే ఆషాడం,శ్రావణ మాసములకు అవసరమైన అన్ని వేడుకల కోసం ప్రత్యేక దిగలు ఈ షోరూంలో మీకోసం ఎదురు చూస్తున్నాయని, అందరు ఈ మంచి ఆఫర్ల సదవకాశం నియోగించుకుని తమకు నచ్చిన నగలను కొనుగోలు చేయవలసిందిగా షోరూం యాజమాన్యం కోరారు.

## విద్యార్థుల యోగాసనాలతో పులకరించిన హేలాపురి

మొదటిపేజీ తరువాయి

మెంబరు ఎస్.ఎం.ఆర్. పెదబాబు, విద్యార్ధినీ, విద్యార్ధులతో కలిసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ఈనెల 21న విశాఖపట్నంలో నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు.ఏలూరు జిల్లాలో ఇప్పటివరకు 8,43,302 మంది ఎంతో ఉత్సాహంగా యోగా కార్యక్రమంలో భాగస్వాములు అవ్వడానికి తమపేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. విద్యార్థుల థీమ్ తో నిర్వహించిన యోగా కార్యక్రమంలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థినీ, విద్యార్థులను ప్రత్యేకంగా అభినందిస్తున్నానన్నారు. ఈనెల 14వ తేదీన కూడా జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ,వార్డు,సచివాలయాల పరిధిలో యోగాంధ్ర మాస్ డిమాన్ట్రేషన్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య(చంటి) మాట్లాడుతూ గత నెల రోజులుగా ప్రజలకు యోగాను పరిచయం చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్, ఎన్నో కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ యోగా వలన కలిగిప్రయోజనాలుతెలుసుకుని తానుకూడా యోగా సనాలపై మక్కువ పెంచుకున్నానన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు,ఆర్డిఓ అచ్యుత అంబరీష్, ఏలూరు డిఎస్పీ డి.శ్రావణ్ కుమార్, డిఇఓ ఎం. వెంకట లక్ష్మమ్మ, సర్వశిక్షా అభియాన్ ఏపిసి కె.పంకజ్ కుమార్, ఆయుష్ డిడి లక్ష్మీసుభద్ర, డిఆర్డిఏ పిడి డా.ఆర్. విజయరాజు, నగరపాలక సంస్థ కమీషనరు ఎ. భానుప్రతాప్, ఎస్సీ కార్పోరేషన్ ఈడి ఎం. ముక్కంటి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఎన్.ఎస్. కృపావరం, సెట్ వెల్ సిఇఓ ప్రభాకర్, జిల్లా బి.సి. సంక్షేమ అధికారి ఆర్.వి. నాగరాణి, పర్యాటక శాఖ మేనేజరు పట్టాభి, ఏలూరు ఇన్చార్జి తహశీల్దారు గాయత్రి, పలువురు కార్పొరేటర్లు, మానవతా తదితర స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు,వివిధశాఖల అధికారులు,పెద్దసంఖ్యలోవిద్యార్థులు,ప్రజలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే డా.కామినేనికి 'యువగళం' అందించిన మంత్రి లోకేష్

మొదటిపేజీ తరువాయి

చేపడుతూ వారికీ ఎన్నడూ లేని విధంగా ఎలాంటి పూర్వపు ప్రచార ఆర్భాటాలు లేకుండా రాజముద్రతో పుస్తకాలు, యూనిఫామ్‌లు,సకల సౌకర్యాలు అందిస్తున్నటువంటి మీకు ఈతరంవారు కృతజ్ఞులు అవ్వుతారు అని మంత్రి లోకేష్ సేవలు కొనియాడారు.

# బాధిత మహిళలకు వన్ స్టాప్ సెంటర్ ద్వారా మెరుగైన సహాయం




**– టోల్ ఫ్రీ 112 నెంబర్‌కి గాని,9550351100 9491195221 కి ఫోన్ లేదా వాట్సాప్ ద్వారా తెలపండి**

**ఏలూరు,మేజర్ న్యూస్ :** బాధిత మహిళల సహాయం కోసం ఏర్పాటుచేసిన వన్ స్టాప్ సెంటర్ కు సహాయం కోసం వచ్చిన మహిళలకు మెరుగైన సహాయం అందించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లోని గౌతమీ సమావేశపు హాలులో శుక్రవారం వన్ స్టాప్ సెంటర్ ద్వారా మహిళలు, బాలలకు అందుతున్న సహాయ కార్యక్రమాలపై కలెక్టర్ అధికారులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ గృహ హింస, అత్యాచారాలు, లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, తదితర బాధిత మహిళలకు ఆశ్రయం కల్పించి, వారి సమస్య పరిష్కారం అయ్యేంత వరకు సహాయం అందించడం వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది బాధ్యత అన్నారు. బాధిత మహిళలు, పిల్లలకు వారి సమస్యలను గుర్తించి, కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ ఇవ్వడం, అవసరమైతే ఎఫ్.ఐ. ఆర్., నమోదు చేసి వారికి సత్వర న్యాయం అందించే దిశగా వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది కృషి చేయాలన్నారు. గృహ హింస, అత్యాచారాలు, లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు సమస్య బాధితులు టోల్ ఫ్రీ 112 నెంబర్‌కి గాని, 9550351100, 9491195221 నంబర్లకు ఫోన్ చేసి సహాయం పొందవచ్చని, బాధితులకు ఉపయోగపడేలా ఈ ఫోన్ నంబర్లను అన్ని ప్రధాన కూడళ్లలో ప్రదర్శించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎక్కడా బాల్య వివాహాలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, 9వ తరగతి ఉత్తీర్ణులైన ప్రతీ విద్యార్థినీ 10వ తరగతిలో చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, ఐసిడిఎస్ పిడి శారద, డి ఆర్ డి ఏ పీడీ విజయరాజు, వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ సిహెచ్. నిర్మల, ఎల్డిఎం నీలాద్రి, ప్రభృతులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు రక్తదాతలు కావాలి




**– జిల్లా కలెక్టర్ ,జిల్లా రెడ్ క్రాస్ ప్రెసిడెంట్ నాగరాణి**

**భీమవరం,మేజర్ న్యూస్ :** ఈ నెల 14వ తేదీ శనివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కలెక్టరేట్ వశిష్ఠ సమావేశ మందిరం నందు రెడ్ క్రాస్ సొసైటీ పశ్చిమగోదావరి జిల్లా యూనిట్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్ చదలవాడ నాగరాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రక్తదానం మహాదానమని, రక్తం దానం చేయడం ద్వారా ప్రాణాపాయ స్థితిలో మరొకరికి ప్రాణం పోసినట్లేనని తద్వారా ఒక కుటుంబం ఆనందంగా జీవించ గలుగుతారన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని ప్రమాదం జరిగిన మొదటి గంటలో రక్తం అందజేస్తే విలువైన ప్రాణాలు కాపాడుకోవచ్చు అన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరు రక్తదానానికి ముందుకు వస్తే ప్రాణాన్ని కాపాడడమే కాక, సమాజ సేవ చేసిన వారు అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఎం.ఎస్.వి శివరామ భద్రరాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జి.గీతాబాయి, డిప్యూటీ డిఎంహెచ్ఓ బి.భాను నాయక్,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు, డీఈఓ ఇ.నారాయణ,ఆర్డీవో ఉమామహేశ్వరరావు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి డి.లక్ష్మి,జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి జి.పిచ్చయ్య, మున్సిపల్ కమిషనర్లు కె.రామచంద్రారెడ్డి, ఏసుబాబు,వబిలిశెట్టి శెట్టి కనకరాజు, పదుల సంఖ్యలో రక్త దానం చేసిన దాతలు, రెడ్ క్రాస్ సంస్థ సభ్యులు,చర్చ్ ఆఫ్ గాడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# కాలువలు, చెరువులు, గట్లు ఆక్రమణల తొలగించుటకు కార్యాచరణ




**– ప్రణాళిక సిద్ధం చేయాలని జేసి టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశం**

**భీమవరం,మేజర్ న్యూస్ :** కలెక్టరేట్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఛాంబర్ లో వాచ్ డాగ్ కమిటీ సభ్యులు మరియు రెవెన్యూ డివిజన్ అధికారులతో ఆక్రమణదారుల నుండి కాలువలు, చెరువులు ట్యాంక్ గట్లు రక్షణ కోసం జిల్లాస్థాయి వాచ్ డాగ్ కమిటీ సమీక్ష సమావేశమును శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి,మాట్లాడుతూ సి సి ఎల్ ఏ చీఫ్ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలోని చెరువులు, కాలువలు గట్లపైన గల ఆక్రమణలు గుర్తించి తొలగించుటకు కార్యచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆయన ఆదేశించారు. జిల్లాలో ఫ్యాక్టరీలు, చిన్న తరహా పరిశ్రమలు, వాణిజ్య వ్యాపారాలు, సెప్టిక్ ట్యాంకులు వలన మంచినీటి కాలువలు, చెరువులు కలుషితమయ్యే ప్రదేశాలను గుర్తించి తొలగించాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు జిల్లాలో 6,892 ఆక్రమణలకు గాను రెవిన్యూ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలకు సంబంధించిన 350.38 ఎకరాలు ఆక్రమణలను గుర్తించడం జరిగిందని అన్నారు. ఈ నెలాఖరు నాటికి ఆక్రమణలను పూర్తిస్థాయిలో గుర్తించాలని, ఆయా శాఖల అధికారులందరూ సమన్వయంతో పనిచేసి జూలై నెల నుండి మూడు నెలల కాలంలో జిల్లాలో ఆక్రమణలన్నీ తొలగించే చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యచరణకు సంబంధించి ప్రతి నెల నాలుగో శనివారం సమావేశం నిర్వహించడం జరుగుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు.ఈ సమావేశంలో డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు ,అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలి



**ఏలూరు,మేజర్ న్యూస్ :** మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు జీవో నెంబర్ 36 ప్రకారం పెంచి అమలు చేయాలని,17 రోజుల సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలని కోరుతూ ఈనెల 20 వ తేదీ తర్వాత నుండి రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు ఏ.పీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్(సిఐటియు) ఏలూరు నగర కమిటీ తెలిపింది. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ఏ. భాను ప్రతాప్ కి నేడు యూనియన్ కమిటీ ఆధ్వర్యంలో సమ్మె నోటీసు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షులు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి. సోమయ్య మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు గత ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని,ఈ ప్రభుత్వం కూడా ఆ అన్యాయాన్ని సరిదిద్దేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఇంజనీరింగ్ కార్మికులకు జీ.వో నెంబర్ 36 ప్రకారం 21,000 24,500 చొప్పున జీతాలు పెంచి అమలు చేయాలని అన్నారు. పారిశుద్ధ విభాగం కార్మికులకు రూ.21 వేలు ఇస్తూ ఇంజనీరింగ్ కార్మికులకు 15 వేల రూపాయల జీతాలు చెల్లించడం అన్యాయం అన్నారు. గత ఆరు సంవత్సరాలుగా ఒక్కో ఇంజనీరింగ్ కార్మికుడు నాలుగున్నర లక్షల రూపాయలు నష్టపోయారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు లావేటి కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి ఏ జానుబాబు, ఉపాధ్యక్షులు బంగారు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఇట్లు బి. సోమయ్య,ఏలూరు.

# వడాలి జడ్పీ ఉన్నత పాఠశాలలో పుస్తకాలు పంపిణీ




**ముదినేపల్లి,మేజర్‌న్యూస్ :** ఈ విద్యా సంవత్సరంలో పాఠశాలలు తెరిచిన రోజు వడాలి జడ్పీ ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకం నుండి పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేయగా డొక్కా సీతమ్మ మధ్యాహ్నం బడి భోజనం పథకాన్ని పరిశీలించి విద్యార్థులకు భోజనం వడ్డన చేశారు. ఈ కార్యక్రమంలో కైకలూరు టిడిపి ఇన్చార్జ్ వీరమల్లు నరసింహారావు,హెచ్ఎంవి ప్రభుదాస్ ,వీఆర్వో పద్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రులు మెరుగుపరచాలి

**– రోగులకు మెరుగైన వైద్యం అందించాలి : సిపిఎం**

**ఏలూరు,మేజర్ న్యూస్ :** జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రులు మెరుగుపరచాలని, రోగులకు మెరుగైన వైద్యం అందించాలని, ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, నాణ్యమైన మందులు ఉచితంగా సరఫరా చేయాలని సిపిఎం జిల్లా కమిటీ తరఫున జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటన విడుదల చేశారు. ఏలూరు సర్వజన ఆసుపత్రి (జిజిహెచ్)లో వైద్య సేవలు రోజురోజుకు దిగజారి పోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలకు లెక్క లేకుండా పోతుందని వాపోయారు. అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇటీవల గర్భిణీ స్త్రీ కి కాల పరిమితి దాటిన మందులను ఇవ్వడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. ఏలూరు రూరల్ పాలగూడెం ప్రాంతానికి చెందిన భవాని అనే గర్భిణీ మహిళ ఈ నెల 11న జిజిహెచ్ కు వైద్యం కోసం వచ్చిందని, పరీక్షించిన వైద్యులు ఆమెకు మందులు చీటీ ఇచ్చారని, కౌంటర్ నుండి ఇచ్చిన కాల పరిమితి దాటిన మందులను వైద్య సిబ్బంది నిర్లక్ష్యంతో గర్భిణీకి ఇవ్వగా ఆమె కుటుంబ సభ్యులు ఈ విషయం గ్రహించడంతో ఆమెకు ప్రమాదం తప్పిందని తెలిపారు.

# నిరాదరణకు గురవుతున్న 63 శాతం వృద్ధులు






**– వారిని ఆదుకోవాల్సిన బాధ్యత అందరిది**

**– భరణం పొందే హక్కు తల్లిదండ్రులకు ఉంది**

**ఏలూరు,మేజర్‌న్యూస్** : రాష్ట్రా న్యాయసేవా అధికార సంస్థ అమరావతి ఆదేశాలు ప్రకారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ ఈ నెల 15వ తేదీ వయోవృద్ధుల వేధింపుల అవగాహన దినోత్సవం సందర్భంగా ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమం లో భాగంగా శుక్రవారం స్థానిక సీనియర్ సిటిజన్ అసోసియేషన్ హాలునందు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ మాట్లాడుతూ నేటి సమాజంలో 63 శాతం వృద్ధులు నిరాధారణకు గురవుతున్నారని,ఉమ్మడి కుటుంబ వ్యవస్థ పోయిన తర్వాత పిల్లలకు తల్లిదండ్రుల పై బాధ్యత లేకుండా పోయిందని అన్నారు. తల్లిదండ్రులు చిన్ననాటి నుండే కుటుంబ విలువలు,సమాజం పట్ల అవగాహన కల్పించాలని పెద్దల జీవన అనుభవం కుటుంబ పాలనకు ఎంతో ఉపయోగ పడుతుందని సూచించారు. నిరాధారణకు గురైన వృద్ధులు వారి పిల్లల నుండి భరణం పొందే హక్కు ఉందని అలాగే గిఫ్టుగా ఇచ్చిన ఆస్తులను అవసరమైనపక్షంలో తిరిగిపొందవచ్చని సూచించారు. తల్లిదండ్రుల రక్షణ,పోషణ,వైద్యం, మొదలైన సౌకర్యాలను కల్పించాల్సిన బాధ్యత పిల్లలపైన ఉందని అన్నారు. నిరాధారణకు గురైన వృద్ధులకు ఎటువంటి న్యాయ సహాయం అవసరమైన జిల్లా న్యాయ సేవా అధికార సంస్థలు కాని లేదా మండల న్యాయ సేవాధికార సంస్థలు గాని సంప్రదించవచ్చని సూచించారు ఈ కార్యక్రమంలో న్యాయవాది రత్నరాజు ఏలూరు వయోవృద్ధుల అసోసియేషన్ ప్రెసిడెంటు ఎన్.వి.వి.ఎస్. ప్రసాదు,ఇతర సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## మరణించిన వ్యక్తి కుటుంబానికి రూ.10 లక్షలు అందజేయాలి



**నరసాపురం,మేజర్ న్యూస్** : స్థానికపొన్న పల్లి కి చెందిన నాటిన రాంబాబు చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు వలలో చిక్కుకొని చనిపోయాడు. ఈ వృత్తి చాలా ప్రమాదకరమైనది తెలిసిన జీవనోపాధి కోసం ఈ వృత్తిని ఎంచుకుని సాగిస్తున్నారు. తరచూ ఈ ఘటనలు జరుగుతూనే ఉన్నాయి.ఈయన చనిపోవడం ఆ కుటుంబానికి తీరని లోటు అని మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జల్లి రామ్మోహన్ రావు అన్నారు. శుక్రవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నుండి పది లక్షల రూపాయలు అందజేయాలన్నారు. నిరుపేదలైనందున ప్రభుత్వం రెండు సెంట్లు ఇంటి స్థలం ఇచ్చి గృహాన్ని నిర్మించి అవ్వాలని కోరారు. పరామర్శించిన వారిలో సిఐటియు నాయకులు ముచ్చర్ల త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

## కమిషనర్ ని కలిసిన మత్స్యకార సంఘాల నేత పెద్దిరాజు,రామరాజు



**అమరావతి/నరసాపురం,మేజర్ న్యూస్**: రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ రామ శంకర్ నాయక్‌ని రాష్ట్ర మత్స్యకార సంఘాల సమైక్య చైర్మన్ కొల్లు పెద్ది రాజు,తెలుగుదేశం పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్చార్జ్ పొత్తూరిరామరాజు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు.అమరావతిలోని ఆయన కార్యాలయంలో కలసి పుష్పగుచ్చం అందజేశారు. ఈసందర్భంగా రాష్ట్రంలోని మత్స్యకారులను ఆదుకోవాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుకూలంగా సహకరించి మత్స్యకారుల జీవన శైలిని మెరుగుపరచాలని అన్నారు.

## ఎన్‌సిసి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



**నర్సాపురం, మేజర్ న్యూస్** : సెవెన్ ఆంధ్ర నావెల్ యూనిట్ ఎన్‌సిసి ఆధ్వర్యంలో అంతర్జాతీయ బ్లడ్ డోనర్స్ డే సందర్భంగా స్థానిక ఎన్ సి సి యూనిట్ నందు రక్తదాన శిబిరం నిర్వహించారు. శుక్రవారం జరిగినఈ క్యాంపు కి 7ఆంధ్ర నావిగేట్ ఎన్ సి సి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ సంజిత్ రౌత్రే కమాండింగ్ ఆఫీసర్ సి రోహిత్ కుమార్ ఆధ్వర్యంలో సుమారు 30 మంది ఎన్‌సిసీ కేడియట్స్ స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో లెఫ్టినెంట్ సంజిత్ రవి కూడా రక్తదానం చేసినారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి క్యారియర్స్ తో మాట్లాడుతూ రక్తదానం చేయడం వలన కలుగు ఉపయోగాలని క్యారెట్స్ కి వివరించినారు. దాని ద్వారా ఎంతో మంది ప్రాణాలను కాపాడుతున్నారని వివరించినారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ డైరెక్ట్ డిస్టిక్ కమిటీ మెంబర్ గోపిశెట్టి వెంకట మురళీ కృష్ణారావు,రెడ్ క్రాస్ సమన్వయకర్త ఎనుముల సతీష్, డాక్టర్ పేర్రాజు,మెడికల్ ఆఫీసర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెన్నేటి కుటుంబానికి సిపిఎం నేతల పరామర్శ



**యలమంచిలి,మేజర్ న్యూస్**: చించినాడ గ్రామ పోరాట యోధురాలు, మహిళా సంఘం నాయకురాలు తెన్నేటి లక్ష్మీ ఇటీవల ఆకస్మికంగా మృతి చెందారు. లక్ష్మీ కుటుంబ సభ్యులను శుక్రవారం సిపిఎం నేతలు పరామర్శించారు. లక్ష్మీ భర్త చించినాడ పోరాట యోధుడు తెన్నేటి సంపతరావు, కుమారులు శివాజీ, స్టాలిన్ లను కుమార్తెలు సత్యవతి జానకిలను ఓదార్చి ధైర్యం చెప్పారు. అలాగే చిన్నారులు రాజ్యలక్ష్మి, రస్మిత బ్లెషి,చెర్రీ క్రిస్ వారి చదువు ల గురించి నాయకులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి బలరాము మంతెన సీతారాం రాష్ట్ర నాయకులు కేతా సూర్యరావు మండల కార్యదర్శి కామ్రేడ్ బాలరాజు, సిఐటియు మండల కార్యదర్శి దేవ సుధాకర్ తొట్టెంపూడి కోటేశ్వరరావు, ఊటాల చిట్టిబాబు, ముమ్మిడివరపు ఆంజనేయులు, భారతల పద్మరాజు ఆకుమర్తి ఏసురత్నం ఎస్.నాగమణి ముస్కూడి జయశ్రీ పల్లేరు వెంకటస్వామి ఎస్. అనసూయ ఎస్. గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రవికుమార్ ఆకస్మిక మృతి ఆర్టిసి ఉద్యమాలకు తీరని లోటు

**– సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్**

**ఏలూరు,మేజర్ న్యూస్** : ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ పశ్చిమ గోదావరి జిల్లా కోశాధికారి రావి రవికుమార్ ఆకస్మిక మృతి ఆర్టీసీ ఉద్యమాలకు తీరని లోటని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఏఐఎస్ఎఫ్ విద్యార్ధి ఉద్యమాల్లో రవికుమార్ చురుకుగా పాల్గొనేవారని పేర్కొన్నారు. ఆర్టీసీ లో కండక్టర్ గా తన జీవితాన్ని ప్రారంభించి, ఆర్టీసీ పశ్చిమగోదావరి జిల్లా కోశాధికారిగా పనిచేస్తూ,ఆర్టీసీ ఉద్యోగ, కార్మిక సమస్యలు పరిష్కారానికి యూనియన్ నిర్వహించిన అనేక ఉద్యమాలు,పోరాటాల్లోపాల్గొనేవారుఅని తెలిపారు .రవికుమార్ మృతి ఆర్టీసీ ఉద్యమాలకు తీరని లోటుగా పేర్కొంటూ, రవికుమార్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## వరద పంపు గ్రామాల్లో ముందస్తు చర్యలు : ఆర్డీవో రమణ



**కుకునూర్,మేజర్ న్యూస్** : కుక్కునూరు మండలంలో రానున్న వరద పంపు గ్రామాల్లో ముందస్తు చర్యలు,ప్రణాళికలు తయారు చేసే విధంగా శుక్రవారం జంగారెడ్డిగూడెం ఆర్డీవో రమణ గొమ్ముగూడెం, అరవపల్లి,రాయకుంట గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న వరదలను ఎదుర్కొనడానికి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మంచినీళ్లు శానిటేషన్ నిత్యవసర వస్తువులు మొదలైనవన్నీ కూడా ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేసుకోవాలని,ప్రణాళిక తయారు చేసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. స్థానిక ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రమేష్ బాబు ఏ ఈ వీరస్వామి ఏపీవో మాధవరావు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు సచివాలయ సిబ్బంది వివిధ శాఖల అధికారులు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ రైతు అవార్డు గ్రహీతను సత్కరించిన జనసేన నేత పోలిశెట్టి



**మొగల్తూరు, మేజర్ న్యూస్** : మండలం లోని రామన్నపాలెం పంచాయితీ ఆకనవారితోటకు చెందిన అయితం థాన్ చందు 2024-25 ఆర్థిక సంవత్సరానికి డాక్టర్ ఎంవీ రెడ్డి ఉత్తమ రైతు అవార్డుకు ఎంపికయ్యారు.ఆయనను జనసేన నియోజకవర్గ యువ నాయకులు పోలిశెట్టి శ్రీనివాస్ సత్కరించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమం సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రైతు దేశానికి వెన్నెముక లాంటి వాడని, రైతు లేనిదే మనుగడ లేదన్నారు.

వాతావరణానికి అనుకూలమైన పంటలను వేస్తూ మరింత దిగుబడి వచ్చేలా లాభదాయకంగా వ్యవసాయాన్ని సాగు చేయాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారుల సలహాలను కూడా పాటించి తక్కువ పెట్టుబడి తో ఎక్కువ లాభాలు వచ్చేలా కృషి చేయాలని అన్నారు. మన నియోజకవర్గానికి చెందిన అయితం దాన్ చంద్ కి ఈ అవార్డు రావడం మన ప్రాంత ప్రజలకు గర్వకారణంగా చెప్పుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు, జనసేన కార్యకర్తలకు పాల్గొన్నారు.

# సూపర్ సిక్స్ లోని మరో హామీ అమలు

**– రాష్ట్రంలో 67.27 లక్షల మందికి తల్లికి వందనం**

**– జిల్లాలో 2.15 లక్షల మంది విద్యార్థులకు మంజూరు : మంత్రి 'కొలుసు'**



**నూజివీడు,మేజర్ న్యూస్** : సూపర్ సిక్స్‌లోని మరో హామీ అయిన తల్లికి వందనం అమలు కావడంపై రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వం మాదిరిగా కుటుంబంలో ఒక విద్యార్థికే ఆర్థిక సాయాన్ని పరిమితం చేయకుండా ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ కుటుంబంలో ఎంత మంది విద్యార్థులు ఉన్నా నిబంధనలు మేరకు తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఆ మేరకు ఏలూరు జిల్లాలో ఇప్పటికే అర్హులైన 2,15,082 అర్హులైన విద్యార్థులుగా గుర్తించి ప్రతి విద్యార్థికి రూ.15 వేల వంతున ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వ మార్గదర్శకాలు అనుగుణంగా జిల్లాలో 1,40,764 తల్లులను నిర్ధారించారన్నారు. ఈ మేరకు శుక్రవారం నుంచి అర్హులైన పిల్లల తల్లుల ఖాతాల్లోకి నిధులు జమ చేసే ప్రక్రియ ప్రారంభం కావడం ఆనందదాయకమన్నారు. విద్యార్థుల తల్లులకు ఆసరాగా తల్లికి వందనం నిలుస్తుందన్నారు. ఒక్కొక్క విద్యార్థికి రూ.15 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందించే ప్రక్రియలో స్కూల్ శానిటేషన్, మెయింటెనెన్స్ కింద రూ.2 వేలు మినహాయింపు చేసి మిగిలిన రూ.13 వేలు చొప్పున జమ చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు అధికారం చేపట్టిన ఏడాదిలోనే తల్లికి వందనం నిధులు అందాయని హర్షం వ్యక్తం చేశారు.

## .14న జిల్లా వ్యాప్తంగా యోగాంధ్ర మాక్ డెమో

**– వట్లూరు టిటిడిసిలో ఉదయం 7గంటలకు యోగాంధ్ర నిర్వహణ**



**ఏలూరు,మేజర్ న్యూస్** : ప్రజల్లో యోగా ప్రాముఖ్యతను పెంపొందించే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా ఈనెల 14న యోగాంధ్ర మాక్ డెమో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఈనెల 14వ తేదీ శనివారం ఉదయం గ్రామ, వార్డు, సచివాలయాల పరిధిలో 6,197 వేదిక ల్లో నిర్వహించే ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించి వేదిక యోగా మ్యాట్లు, త్రాగునీరు, తదితర ఏర్పాట్లు చేయాలని మండలస్థాయి అధికారులను ఆదేశించారు. మండలస్థాయి అధికారులందరూ ఈ కార్యక్రమంను పర్యవేక్షించి అవసరమైన మార్గదర్శకాలు ఇవ్వాలన్నారు. స్థానిక ప్రజలు, విద్యార్థులు, సిబ్బంది, తదితరులు చురుగ్గా ఈ కార్యక్రమంలో పాల్గొనేలా ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో ఇంతవరకు యోగా ఆంధ్ర కార్యక్రమం పాల్గొనేందుకు 8,46,428 మంది తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. వట్లూరు టిటిడిసిలో ఉదయం 7 గంటలకు యోగాంధ్ర మాక్ డెమో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా అధికారులు అంత ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

## అంగన్వాడి కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాసాలు



**పెనుగొండ,మేజర్ న్యూస్**:పెనుగొండ అంగన్వాడి కేంద్రాల ఆధ్వర్యంలో 3 సంవత్సరాల బాల బాలికలకు సామూహిక అక్షరాభ్యాసాలను వేంద్ర వారి వీధి అంగన్వాడీ కేంద్రం నందు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ నక్కా శ్యామల సోనీ, ఐసిడిఎస్ సిడిపిఓ కృష్ణకుమారి, సూపర్వైజర్ సుజాత, అంగన్వాడీ కార్యకర్తలు,ఆయాలు,పిల్లలు, తల్లులు హాజరయ్యారు. సర్పంచ్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నారు. స్పోకెన్ ఇంగ్లీష్,ఆట వస్తువులు ,పుస్తకాలు అన్నీ ప్రభుత్వం వారు అందజేస్తున్నారు. 3 సంవత్సరాలు నిండిన పిల్లలు అందరిని అంగన్వాడిలో చేర్చి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని అన్నారు. 20 మంది బాల బాలికలకు అక్షరాభ్యాసాలు చేయించారు.

# భీమవరం నుండి భద్రాచలం కు కొత్త బస్సు సర్వీస్

**– ప్రారంభించిన జోనల్ చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు**



**ఏలూరు,మేజర్ న్యూస్** : రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ భీమవరం నుండి భద్రాచలం కు కొత్త సర్వీసు ఏలూరు డిపో నందు ప్రారంభోత్సవం జరిగింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్, ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జీ రెడ్డి అప్పల నాయుడు హాజరయ్యారు. తొలుత ఆయనకు ఏలూరు కొత్త బస్టాండ్ లో ఆర్టీసీ ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన చేతుల మీదుగా ఈ బస్సు సర్వీస్ ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అనేక కొత్త బస్సులు కొత్త రూట్ల నందు ప్రవేశపెట్టడం జరిగిందని, అదేవిధంగా భద్రాచల శ్రీరామచంద్రులు దర్శనానికి భీమవరం డిపో నుండి గతంలోనే ఒక బస్సు పెట్టడం జరిగిందని, మళ్లీ పార్లమెంటు సభ్యులు పుట్టా మహేష్ ఆదేశాల మేరకు రాత్రిపూట కూడా ఒక బస్సుని పెట్టాలని,ఈ నూతన సర్వీస్ (బస్సు) ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. భీమవరం డిపో మేనేజర్ పి.ఎన్.వి.ఎం.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఈ బస్సు భీమవరంలో రాత్రి 8 గంటలకు బయలుదేరి ఏలూరు 10 గంటలకు వచ్చి భద్రాచలం మూడు గంటలకు చేరుతుందని, తిరిగి మరుసటి రోజు ఉదయం 8 గంటలకు బయలుదేరి, ఒంటి గంటకి ఏలూరు చేరుకొని మూడు గంటలకి భీమవరం చేరుకుంటుందని, ఈ సర్వీస్ ని కూడా ప్రజల ఆదరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ బి.వాణి,ఏ.ఎం.టి జి.మురళి, ఎం.ఎఫ్.ఐ. ప్రేమ్ కుమార్,పి.ఆర్వో ,నరసింహం పలువురు ఆర్టీసీ కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.

## స్కూల్‌కు గ్యాస్ స్టవ్ బహూకరణ



**పాలకొల్లు,మేజర్ న్యూస్**: మండల పరిధిలో గల ఎం ఎ ఎ కా వ వం ం నెంబర్ టు బేసిక్ ప్రైవేట్ స్కూలుకు భవానీ ప్రసాద్ రాయపూడి సహకారంతో పాలకొల్లుకు చెందిన గాదె సుబ్బారావు సౌజన్యంతో మధ్యాహ్న భోజన పథకం నిమిత్తం గ్యాస్ స్టవ్ బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యార్థుల కొరకు సన్న బియ్యం పంపిణీ. నాణ్యతతో కూడిన బ్యాగులు. బెల్టు. పుస్తకాలు. మొదలగున్నవి బాగున్నాయని. దాతలు కనిపిస్తున్న సౌకర్యాలు వినియోగించుకుని మంచి పౌరులుగా ఎదగాలని ఈ సందర్భంగా చెప్పారు.స్కూల్ ఏ అవసరం వచ్చిన నన్ను సంప్రదించాలని ఈ సందర్భంగా గ్రామస్తులు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని వెల్ల బేబీ సరోజ,పిఎంసి సభ్యులు.ఎండిఎం నిర్వాహకులు తోట కుమారి శానిటేషన్ ఆయా ఎం ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

## కమిషనర్ ఏసుబాబు కు సత్కారం



**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్** : ఈ నెల 14వ తేదీ వరల్డ్ బ్లడ్ డొనేషన్ డే సందర్భంగా భీమవరం కలెక్టర్ కార్యాలయం నందు నిర్వహించిన కార్యక్రమములో తాడేపల్లిగూడెం పురపాలక సంఘము నందు 21న రెడ్ క్రాస్ సొసైటీ వారి ఆధ్వర్యములో అత్యధికముగా బ్లడ్ డొనేషన్ చేసి ప్రజలప్రాణాలు కాపాడుటకు సహకరించినందున కమీషనరు యం.యేసుబాబు కి రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ,జిల్లా కలెక్టర్ వారి చేతుల మీదగా అవార్డు ప్రదానం చేశారు. ఈ బ్లడ్ డొనేషన్ క్యాంప్‌లో అధిక ప్రాధాన్యత ఇచ్చి ఎక్కువ మందితో రక్తదానము చేయించినందున సన్మానము చేసి అభినందనలు తెలియచేసియున్నారు.

## ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నేత రవి కుమార్ మృతికి సంతాపం



**ఏలూరు,మేజర్ న్యూస్** : ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నాయకులు ఏఐఎస్ఎఫ్ పశ్చిమ జిల్లా మాజీ కార్యదర్శి ఆర్ రవికుమార్ మృతికి ఏఐటియుసి, సిపిఐ,బికేయంయు జిల్లా సమితిలు ప్రకటనలో సంతాపం తెలిపాయి. రవికుమార్ విద్యార్థి దశలోనే ఏఐఎస్ఎఫ్ లో క్రియాశీల కార్యకర్తగా పనిచేస్తూ కింద స్థాయి నుండి జిల్లా స్థాయి నాయకుడిగా ఎదిగారని, తర్వాత కాలంలో ఆర్టీసీలో ఉద్యోగం వచ్చిన తర్వాత ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్‌లో కార్యకర్తగా డిపో స్థాయి నుండి రీజనల్ స్థాయి నాయకుడిగా ఎదిగి ఆర్టీసీ కార్మికులకు విశేష సేవలు అందిస్తున్నారని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య,బికేయంయు జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు తెలిపారు. ఏడు మాసాల క్రితం గుండెకు సంబంధించి ఆపరేషన్ జరిగి ఆరోగ్యంగా ఉంటున్న రవికుమార్ గురువారం రాత్రి మరల నిద్రలోనే గుండెపోటు వచ్చి మరణించడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని వారి పేర్కొన్నారు. రవికుమార్ మరణం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కి తీరని లోటని వారన్నారు. రవికుమార్ మృతికి సంతాపం తెలుపుతూ ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.ఏఐటియుసి ఏలూరు జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు, ఏఐటియుసి ఏలూరు ఏరియా అధ్యక్ష కార్యదర్శులు కె కృష్ణమాచార్యులు ఏ అప్పలరాజు రవికుమార్ మృతికి సంతాపం తెలిపారు.

# విద్యార్థిని మధులతకు సాయం అందించిన ఎమ్మెల్యే బొలిశెట్టి

**– వాసవి కళాశాలలో ఇంజనీరింగ్ సీట్‌కు రూ.25 వేల వితరణ**



**తాడేపల్లిగూడెం/పెంటపాడు, మేజర్‌న్యూస్** : చదువు కోవాలని అందరికీ ఉంటుంది. కానీ ఉన్నత చదువులు చదివి అనుకున్నది సాధించడం కొందరికే సాధ్యమవుతుంది. పెంటపాడు మండలం అలంపురం గ్రామంలో శ్రవణం రంగారావు కు ఇద్దరు ఆడపిల్లలు అతనికి ఉన్న ఆర్థిక ఇబ్బందులతో ఒకరిని చదువు ఆపేసి ఇంటికి పరిమితమయ్యారు. మరొక కుమార్తె శ్రవణం మధులత తన భవిష్యత్తుపై కొండంత ఆశతో ఇంటర్మీడియట్‌లో 973 మార్కులు సాధించి ఆపేద తండ్రి వద్దనే ఉండిపోయింది. తండ్రికి ఏమి చేయాలో తెలియని సమయంలో ఒక చిన్న పాటి ఆశతో స్దానిక శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ ను కలిసి తమ గోడు విన్నవించు కున్నారు. అది విన్న రాష్ట్ర ప్రభుత్వ విప్, బొలిశెట్టి శ్రీనివాస్ తక్షణం స్పందించి వాసవి ఇంజినీరింగ్ కాలేజ్ పెద్దతాడేపల్లి ఇంజనీరింగ్‌కళాశాలలో మధులత కోరినఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ కోర్సు నందు మధులతని చేర్పించుటకు తనవంతుగా రూ 25 వేల ఆర్థిక సాయాన్ని కళాశాల యాజమాన్యానికి అందించి, ఆమె చదువు కొరకు ముమ్ముందు ఎటువంటి సహాయ సహకారాలు అవసరమైనప్పటికీ తాను వెన్నంటి ఉంటానని ఎమ్మెల్యే మధులత కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమం లో రామరపు మారుతీ రవి, సుంకవల్లి రాజ్ కుమార్, చలంచర్ల సుబ్బారావు, గ్రంధి సత్యనారాయణ, యంత్రపాటి రాజు, పై బోయిన వెంకట రామయ్య, గట్టిం నాని, పిడుగు మోహన్ బ్రదర్స్, కోట శ్రీరామ్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# సమాజ సేవలో భారతీయ స్టేట్ బ్యాంకు



**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్** : భారతీయ స్టేట్ బ్యాంకు కేవలం వ్యాపారం కోసమే కాక సమాజసేవలో కూడా పాలు పంచు కుంటున్నదని బ్యాంకు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం సందర్భంగా పాల్గొన్న వక్తలు పేర్కొన్నారు. స్టేట్ బ్యాంకు దినోత్సవం సందర్భంగా దేశంలోని అన్ని ముఖ్య కేంద్రాల వద్ద రక్తదానశిబిరాలు ఏర్పాటు చేసినట్లు బ్యాంకు రీజనల్ మేనేజర్ రమేష్ నాయుడు పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలో ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచ్ వద్ద రక్తదాన శిబిరాన్ని రమేష్ నాయుడు ప్రారంభించారు. బ్యాంకు చైర్మన్ సూచనలమేరకు బ్యాంకుచేపట్టిన ఈకార్యక్రమం జయప్రదం చేయాలని ఆయన కోరారు. బ్యాంకు చీఫ్ మేనేజర్ ఎన్ ప్రకాష్ మాట్లాడుతూ బ్యాంకు పురోభివృద్ధికి సహకరించినట్టే సమాజసేవలో కూడా సిబ్బంది సహకరిస్తున్నారని పేర్కొన్నారు. ఎస్‌బి ఐ అధికారుల సంఘ జోనల్ కార్యదర్శి జి జవహర్లాల్ ఏపీ టిబి ఈ ఎఫ్ కార్యదర్శి టివి సూర్యనారాయణ,యూఎఫ్‌బియు కన్వీనర్ ఎస్ఎస్ ప్రసాద్‌లు మాట్లాడుతూ బ్యాంకు తమ వ్యాపారాభివృద్ధికోసం కృషి చేసినట్లే సమాజంలో ప్రజల కోసం కూడా పనిచేస్తుందని తామ సిబ్బంది పనిచేస్తారని పేర్కొన్నారు. రక్తదానం అత్యంత విలువైన సేవ అనీ రక్తదానం ద్వారా బ్యాంకు స్టాఫ్ చేస్తున్న అమూల్యమైన సేవలు మరువలేమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎస్‌బిఐ సిబ్బంది సంఘ నాయకులూ పవన్ కుమార్ లోకల్ కార్యదర్శి డేనియల్ కిరణ్, దసిక శ్రీనివాస్ కనకారావు ఇతర స్టాఫ్ మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

# ఏడాది కూటమి ప్రభుత్వంలో సుపరిపాలన



**– గత ఐదేళ్ల వైసిపి పాలన అధోగతి : మాజీ మంత్రి 'పితాని'**

**పెనుమంత్ర, మేజర్ న్యూస్**: గత ఐదేళ్ల వైసిపి పాలనలో, అరాచకం, విధ్వంసాల పాలన సాగిందని, ప్రజలు జగన్ రెడ్డిని ఇంటికి పంపించి ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారని మాజీ మంత్రి ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మార్టేరు లో పల్లె పల్లెకు మన పితాని సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మీరు ఇచ్చిన అధికారంతో కేంద్రంలోనూ రాష్ట్రంలోనూ ఎన్డీఏ కూటమి పాలన సుపరిపాలన అందిస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ రెండు కళ్ళుగా ముందుకు సాగుతుందని కితాబిచ్చారు. ప్రజలకు జన రంజిక పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు అభినందనలు తెలిపారు. ఎన్నికల్లో ఏదైతే హామీ ఇచ్చాను సూపర్ సిక్స్ పథకాలను ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వాన్ని అమరావతి రాజధాని నిర్మాణాన్ని జీర్ణించుకోలేని జగన్ రెడ్డి బ్యాచ్ వేశ్యల రాజధానిగా సాక్షి మీడియాలో చర్చ వేదిక జరగడాన్ని తీవ్రంగా ఖండించారు. బే షరతుగా జగన్ రెడ్డి మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.మార్టేరులో రజకులకు కేటాయించినచెరువును అమ్ముకునిదుర్మార్గపు రాజకీయాలు చేస్తారని ప్రశ్నించారు. ఇళ్ల పట్టాలకు వసూళ్ల చేసిన సొమ్మును వెనక్కి ఇవ్వాలని లేకుంటే క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో దిగమర్రు –కొవ్వూరు హైవే రహదారి నిర్మాణం పూర్తి చేస్తామని, వశిష్ట గోదావరిపై పి గన్నవరం నుండి కోడేరు వరకు బ్రిడ్జి నిర్మాణం చేపడితే మార్టేరు కేంద్ర బిందువు అవుతుందన్నారు. మార్టేరు తోక పేట నుండి కొటాలపర్రు వరుకు రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని మార్తేరు తోక పేట వరకు సిమెంట్ రోడ్డు నిర్మిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు వెలగల బుల్లిరామి రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు గుడిమెట్ల లక్ష్మణ్ రెడ్డి కోనాల శ్రీనివాసరెడ్డి,మండల తాసిల్దార్ వై రవికుమార్, ఎంపీడీవో ఎంఎస్ ప్రభాకర్ రావు క్లస్టర్ ఇంచార్జ్ కర్రీ అచ్యుతారామిరెడ్డి, తేతలి రాజారెడ్డి జనసేన మండల అధ్యక్షులు కోయ కార్తీక్, ఆలీ,బిజెపి మండల అధ్యక్షులు రవి, నీటి సంఘం అధ్యక్షులుఇందుకూరి వెంకట నరసింహరాజు, కడలి ఏడుకొండలు సత్తిసాయి ఆదినారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రక్త దాత అందే వెంకట కృష్ణకు జిల్లా కలెక్టర్ ప్రశంసాపత్రం




**భీమవరం,నర్సాపురం,మేజర్‌న్యూస్** : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో 30 సార్లు రక్తదానం చేసిన నరసాపురం కు చెందిన అందే వెంకట కృష్ణకు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిప్రశంసా పత్రంఅందజేశారు. శుక్రవారం భీమవరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఈకార్యక్రమం జరిగింది. రక్తదానం చేస్తున్న వెంకటకృష్ణను పలువురు అభినందించారు.

## కూటమి పాలనలో పేదలకు న్యాయం : టిడిపి నేత రాజ్య లక్ష్మి



**నర్సాపురం,మేజర్‌న్యూస్** :కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం అయిన సందర్భంగా యుకె స్సి వనితా క్లబ్ ఆధ్వర్యంలో రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు,జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ సిరిగినీడి రాజ్యలక్ష్మి తన నివాసంలో కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూఎన్నికలముందు రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా తెలుగుదేశం,జనసేన , బి.జె.పి కూటమిగా ఏర్పడి ఎన్నికల్లో విజయ దుందుభి మోగించి ఎన్నికల మేనిపెస్టోలో పొందుపరిచిన సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. పేదలకు ఉపయోగపడే పథకాలు అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువయిందన్నారు. సూపర్ సిక్స్ పథకంలో భాగంగా ఉచిత గ్యాస్ పంపిణీ, దివ్యాంగులకు 6వేలు ఫించను, గురువారం నుండి తల్లికి వందనం పథకం ద్వారా అర్హులయిన ప్రతి ఒక్కరికి 13 వేలు వారి ఖాతాలో జమచేయడం ప్రారంభమైంది అన్నారు. ఆంధ్రప్రదేశ్ ని నవ్యాంధ్ర ప్రదేశ్ చేసే దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వని తాక్లబ్ కార్యదర్శి బండి స్వర్ణలత,సహాయ కార్యదర్శి తోట భారతి,చెన్నాలక్ష్మి, గంటావెంకటరమణ,గంథం రాధిక,నాగమణి, కుసుమ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

## పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి : సిపిఐ



**వేలేరుపాడు, మేజర్ న్యూస్** : స్థానిక సిపిఐ కార్యాలయంలో సిపిఐ మండల కౌన్సిల్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎండి మునీర్ మాట్లాడుతూ అనేక ఏళ్లుగా గిరిజనలు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇచ్చి ప్రభుత్వం వారికి విత్తనాలు ఎరువులు సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోడు భూముల విషయంలో ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించాలని అన్నారు.అలాగే తల్లికి వందనం పథకంలో భాగంగా అందరి పిల్లలకు 15 వేలు ఇస్తానన్న మాటను నిలబెట్టుకోవాలన్నారు. విద్యుత్ వినియోగం ఎక్కువ అంటూ, నాలుగు చక్రాల వాహనం ఉందంటూ, వివిధ కారణాలు చూపిస్తూ అనేక మందికి తల్లికి వందనం అనర్హులుగా పేర్కొవటం సమంజసం కాదన్నారు. ఉపాధి హామీలో పని చసిన కూలీల నగదు చెల్లించాలన్నారు. జులై 5,6,7 తేదీలలో చింతలపూడిలో జరిగే సిపిఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు.ఈ సమావేశంలో కారం దారయ్య, పిట్టా ప్రసాద్, బాడిశ రాము, పిట్టా వీరయ్య, కరటం వెంకటేశ్వరరావు, కురిమెళ్ళ వెంకటేశ్వర్లు, బంధం నాగేశ్వరావు,సోడే ప్రసాద్, బుడిపిటి జాన్ బాబు, తదితరులు పాల్గొన్నారు.